క్లుప్తంగా

ఎమ్మెల్సీని కలిసిన చైర్‌పర్సన్


ఎమ్మెల్సీ రమణకు బొకే అందజేస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్సీ ఎల్.రమణ జగిత్యాలకు రాగా, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్సీని పద్మశాలీ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా సత్కరించింది. వొల్లాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కోరుట్ల/మెట్‌పల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 25న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ న్యాయవాదులు పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకులు డాంగె, లక్ష్మి, సుమలత, ఆంజనేయులు, నరహరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, తోట ఆంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే సదస్సుకు న్యాయవాదులు తరలిరావాలని మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి పిలుపునిచ్చారు. కార్యాలయంలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. పొన్నం దేవరాజు, రాజారాం, సురభి అశోక్, తెడ్డు ఆనంద్, ఆకుల ప్రవీణ్ తదితరులున్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న మహేశ్

జగిత్యాల: పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంగధరి మహేశ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, పెన్షన్ పునరుద్ధరణకు ఈనెల 23న బ్లాక్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, సతీశ్, మహేశ్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీఏలు విడుదల చేయాలి


సభ్యత్వ నమోదులో భూమేశ్వర్ తదితరులు

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డీటీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతినే పునరుద్ధరించాలని, లెఫ్ట్ ఓవర్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్స్ వెంటనే చేపట్టాలన్నారు. కేజీబీవీ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మోగులూరి నరేశ్, మండల అధ్యక్షుడు బబ్బురి రాజేందర్, వేముల శ్రీనివాస్, తిరుకొవెల హరిబాబు, తుంబురి జగన్మోహన్ పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో గురువారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాణ్యతాప్రమాణాలు పాటించని పలువురికి జరిమానా విధించారు. తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ సంచులు వినియోగించాలని సూచించారు. శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. అర్హులు tgbeststuddycircle.cgg.gov. in లో ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో హెలిహోప్ టెక్నికల్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మందికి 90రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగాలు కల్పిస్తారని, శిక్షణ కాలంలో నెలకు రూ.4 వేల చొప్పున భృతి ఇస్తుందని వివరించారు. వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

జగిత్యాల: మహిళలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కలకత్తాలో వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డ్స్‌తో నిరసన తెలిపారు. రాహుల్, అక్షయ్, మావిజ్, రిషి పాల్గొన్నారు.

నీరు ఎత్తి పోసేదెప్పుడో...?

- నిరుపయోగంగా కొత్తపేట ఎత్తిపోతల పథకం
- 262 ఎకరాలకు సాగునీరు
- వినియోగంలోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు


కొత్తపేట ఎత్తిపోతల పథకం

రాయికల్: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాయికల్ మండలం కొత్తపేటలో భూములను సస్యశ్యామలం చేసేందుకు 2003-04 సంవత్సరంలో రూ.26లక్షల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉండటంతో యంత్రాలన్నీ తుప్పు పట్టిపోయాయి. దీంతో ఎత్తిపోతల ద్వారా వ్యవసాయం చేయలేక రైతులు బావులపై వ్యవసాయ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రాయికల్ మండలం కొత్తపేటలో రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్‌రావు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలో 262 ఎకరాలు ఎత్తిపోతల పథకం ద్వారా సాగయ్యేవి. ఈ పథకం పని చేయకపోవడంతో రైతులకు సరిపడా సాగునీరు లేకపోవడంతో మామిడి పంటలపై దృష్టి సారించారు. ఈ గ్రామంలో ఎస్సారెస్పీ నీరు సైతం సరిగా రాకపోవడంతో కేవలం వ్యవసాయ బావులపైనే ఆధారపడి రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని బీఆర్ఎస్ హయాంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి



గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేలా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. మా గ్రామంలోని 262 ఎకరాల భూమి సస్యశ్యామలం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతలు ప్రారంభించాలి.

– చింతలపెల్లి గంగారెడ్డి, రైతు

యంత్రాలు పని చేయడం లేదు



మా గ్రామంలోని ఎత్తిపోతల పథకం యంత్రాలన్నీ తుప్పు పట్టాయి. సాగునీటి కోసం జువ్వాడి రత్నాకర్ రావు హయాంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయగా.. దీనిని పట్టించుకునే నాథుడే లేడు. మా గ్రామంలో ఎస్సారెస్పీ నీరు కూడా సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభించాలి.

– బత్తిని రాజేశం, మాజీ సర్పంచ్



కథలాపూర్: మండలకేంద్రంలో వ్యవసాయశాఖ కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. భవనం ముందు పిచ్చిమొక్కలు పెరిగినా పట్టించుకునేవారు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవనంలో సరైన వసతులు లేవని పేర్కొంటూ అధికారులు రైతు వేదికల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనంలో వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి యోగితా, మండల వ్యవసాయ అధికారి, 72888 94145

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 61630

కార్యదర్శికి సన్మానం

రాయికల్: మండలంలోని రామాజీపేట ఇటీవల ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికై అవార్డు తీసుకోగా, గురువారం పంచాయతీ కార్యదర్శి మహేశ్‌ను వెల్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆలయాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: జగిత్యాల నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు వెచ్చించడం జరుగుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల గ్రామంలో ఎల్లమ్మతల్లి ఆలయాన్ని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్లమ్మతల్లి ఆలయానికి రూ.4 లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రుణమాఫీ కానీ రైతులు అధైర్య పడొద్దని, అందరికీ రుణమాఫీ చేస్తామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ ఆలస్యమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, ఆరె రవి, నాగిరెడ్డి గంగారెడ్డి, గుంటి రవి, నక్క హరీశ్, మెడపట్ల శేఖర్, గౌడ సంఘం నాయకులు మల్లేశంగౌడ్, గంగరాజంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్ సర్కార్

- జువ్వాడి నర్సింగరావు


నర్సింగరావు

కోరుట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని కాంగ్రెస్ కోరుట్ల సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు మేలు చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేశారు. ఇప్పటి వరకు అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతుల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతులు వాస్తవాలు గమనించాలని, బీఆర్ఎస్ నాయకుల ట్రాప్‌లో పడవద్దని పేర్కొన్నారు. ఇప్పటికే విడతల వారీగా రైతులకు రుణమాఫీ చేశారని, మరికొద్ది రోజుల్లో రైతులందరికి మాఫీ జరుగుతుందన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించడానికి నిబద్ధతతో పనిచేస్తుందని పేర్కొన్నారు.

సమాచారం

1న రెడ్డి సంఘం ఎన్నికలు

జగిత్యాలరూరల్: రెడ్డి జనసంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం (2024-26) ఎన్నికలు సెప్టెంబర్ 1న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు ఎన్నం నర్సింహారెడ్డి, ముదుగంటి మహిపాల్ రెడ్డి తెలిపారు. ధరూర్ గ్రామ శివారులోని రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

పద్మశాలీ సంఘం..

కోరుట్ల: కోరుట్ల పద్మశాలీ సంఘం ఎన్నికలు సెప్టెంబర్ 1న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు అందె శివప్రసాద్, బోగ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 23, 24వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 25న ఉపసంహారణ, గుర్తుల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు..

సారంగాపూర్: సారంగాపూర్ మండలస్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఈ నెల 28,30, సెప్టెంబర్ 2న నిర్వహించనున్నట్లు పాఠశాలల క్రీడా అధ్యక్షుడు, మండల విద్యాధికారి వాసం భీమయ్య తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 28న అండర్- 17, 14 బాలికలు, 30న అండర్- 17, 14 బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, సెప్టెంబర్ 2న అండర్- 17, 14 బాల, బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పుట్టిన తేదీ పత్రాలతో సారంగాపూర్ మండల పాఠశాలల క్రీడల కన్వీనర్ రవీందర్‌ను (98484 39349) సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న గడువు

మల్లాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్‌స్కూల్ హాస్టళ్లలో ఔట్ సోర్సింగ్ పోస్టుల దరఖాస్తులకు శుక్రవారంతో గడువు ముగియనున్నట్లు ఎంఈవో భీమయ్య తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టళ్లలో లో హెడ్ కుక్ (ఎస్సెస్సీ పూర్తయినవారు), అసిస్టెంట్ కుక్ (7వ తరగతి చదివినవారు) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఏఎన్ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ లేదా బీఎస్సీ నర్సింగ్, ఇంటర్ పూర్తయిన వారు ఏఎన్ఎం, చౌకీదార్(వాచ్‌మెన్)(ఎస్సెస్సీ పూర్తయినవారు) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శివాజీ చౌక్‌గా నామకరణం చేయాలి


ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్ చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసి శివాజీ చౌక్‌గా నామకరణం చేయాలని బజరంగ్ దళ్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో కొద్ది సేపు పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం నెలకొంది. కల్లూర్ రోడ్ చౌరస్తావద్ద ఫౌంటేన్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్న క్రమంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేసి శివాజీ చౌక్‌గా నామకరణం చేయాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు బజరంగ్‌దళ్ కార్యకర్తలు వినతి పత్రాలు సమర్పించారు. అధికారుల నుంచి ఎలాంటి హామీ రాకపోవడం, చౌరస్తా వద్ద పనులు ప్రారంభం కావటంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని అధికారికంగా ఎలాంటి నిర్ణయం రానందున ఫ్లెక్సీ ఏర్పాటుకు వీలులేదని నాయకులను సముదాయించి పంపించారు. బజరంగ్ దళ్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

జ్వరం ఉంటే పరీక్షలు చేయించుకోవాలి


పెంబట్లలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్లాపూర్: జ్వర లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముత్యంపేట, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలను సందర్శించారు. వైద్యాధికారి వాహిని, సిబ్బంది పాల్గొన్నారు.

పెంబట్లలోమూడు వైద్యశిబిరాలు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల గ్రామంలో గురువారం మూడు చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పెంబట్లలో గతంలో మూడు డెంగీ కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం మరో కేసు నమోదవడం ఆందోళన కలిగిస్తుందని జిల్లా మాతాశిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి అన్నారు. 50 మందికి పరీక్షలు నిర్వహించారు.

ఆయుష్ ఆధ్వర్యంలో..

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి గ్రామంలో ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయకుమారి పాల్గొని వృద్ధులకు మధుమేహం, కీళ్ల నొప్పులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యదర్శి నిఖిల్‌రెడ్డి, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ధర్మపురి/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి: పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. గురువారం వేంపల్లిలో 'నాటుదాం ఒక చెట్టు– అమ్మ పేరు మీద' కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. వెంకట్రావ్‌పేటలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం, గోధూర్‌లో ఎంపీవో చంద్రశేఖర్ మొక్కలు నాటారు. పెగడపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పెగడపల్లిలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మొక్కలు నాటారు. ధర్మపురి పరిధిలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ బుచ్చన్న ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని గాయపర్చిన ఉపాధ్యాయుడిపై విచారణ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో అక్షిత అనే విద్యార్థినిని బుధవారం ఉపాధ్యాయుడు కొట్టడంతో చెవి రింగు గుచ్చుకుని గాయమై రక్తస్రావమైంది. దీంతో బాలికల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఆందోళన చేపట్టారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం డీఈవో జగన్మోహన్‌రెడ్డి, ఎంఈవో గాయత్రి పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. బాలికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాలికకు చికిత్స చేయిస్తామన్నారు. పాపను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా.. చెవి లోపల గాయం కాలేదని తేలింది. పాఠశాలలో ఒక్కో ఉపాధ్యాయుడిని పిలిపించుకుని సదరు ఉపాధ్యాయుడి తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో నివేదిక తయారుచేసి డీఈవోకు అందించారు. కలెక్టర్‌కు నివేదిక అందించిన అనంతరం విద్యాశాఖ క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

సంక్షిప్త వార్తలు

● తపాలా పథకాలను వినియోగించుకోవాలి

మల్లాపూర్: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పథకాలపై బ్రాంచ్ పోస్టుమాస్టర్ దురిశెట్టి రాజేశం మండలంలోని చిట్టాపూర్‌లో అవగాహన కల్పించారు.

● సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్ఐ అనిల్ అన్నారు. వర్షకొండలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

● సహస్ర లింగాల ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం ఎలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

● సేవలు చిరస్మరణీయం

కోరుట్ల: డాక్టర్ విజయ్‌కుమార్ సేవలు చిరస్మరణీయమని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. విజయ్‌కుమార్ గురువారం అనారోగ్యంతో మృతిచెందగా సంతాపం ప్రకటించారు. ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డా.అనూప్‌రావు, డా.రాజేశ్, జగదీశ్వర్, సీనియర్ దిలిప్‌రావు, ప్రభాకర్ సంతాపం ప్రకటించారు.

● మూఢ నమ్మకాలను విశ్వసించొద్దు

పెగడపల్లి: బతికపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, మూఢ నమ్మకాల నిర్మూలనపై భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ అవగాహన కల్పించారు.

● ముగ్గురు ఏఈవోల బదిలీ

కథలాపూర్: మండలంలో కథలాపూర్ ఏఈవో వినీత బదిలీ కాగా ఇక్కడ సంధ్యరాణి విధుల్లో చేరారు. భూషణరావుపేట ఏఈవో ఎండీ ఫమీనా బదిలీ కాగా ఎం.హరీశ్ విధుల్లో చేరారు. బొమ్మెన ఏఈవో వైష్ణవి బదిలీ కావడంతో మౌనిక విధుల్లో చేరారు.

● రోడ్లను ఆక్రమించొద్దు

రాయికల్: రోడ్లను ఆక్రమించి బోర్డులు పెడితే తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ హెచ్చరించారు. పట్టణంలో పాతబస్టాండ్ నుంచి ఇటిక్యాల క్రాసింగ్‌రోడ్ వరకు ఆక్రమించి షెడ్లు, తోపుడు బండ్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

● రెగ్యులరైజేషన్ చేసుకోవాలి

రాయికల్: ఎల్ఆర్ఎస్ స్కీం కింద 2020లో రూ.వెయ్యి ఫీజు చెల్లించినవారికి పట్టణంలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు.

● సన్మానం

మేడిపల్లి: జూనియర్ లైన్‌మెన్‌గా పదోన్నతి పొందిన కొత్తురి సురేశ్‌ను భీమారం మండలం కమ్మరిపేట గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

● ఎమ్మెల్సీ పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల గ్రామంలోని ఎల్లమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

● వ్యాధులపై అవగాహన కల్పించాలి

మెట్‌పల్లిరూరల్: గ్రామాల్లో వ్యాధులు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జోనల్ మలేరియా అధికారి సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని వెల్లుల, జగ్గాసాగర్‌లో ఆశా కార్యకర్తలతో సమావేశం అయ్యారు.

● ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

మల్యాల: రైతులకు ఆంక్షలు లేకుండా రు.2 లక్షలు రుణమాఫీ చేయాలని గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు.

పకడ్బందీగా ఓటరు సర్వే


సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

మల్లాపూర్: ఇంటింటి ఓటర్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కోరుట్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. బీఎల్వోలు రెండు నెలల పాటు సర్వే చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐ సురేశ్, బీఎల్వోలు పాల్గొన్నారు.

'ఎస్‌కేఎన్‌ఆర్'లో క్లైమెట్ స్మార్ట్‌గ్రీన్ క్యాంపస్ క్లబ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

జగిత్యాల: విద్యార్థుల్లో పర్యావరణ స్ఫూర్తిని పెంపొందించేందుకు ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో క్లైమెట్ స్మార్ట్‌గ్రీన్ క్యాంపస్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రొఫెసర్ ఆడెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శిక్షణలో పాల్గొని వచ్చి ఇక్కడ విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ క్లబ్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. గ్రీన్ క్యాంపస్ క్లబ్ వల్ల వాతావరణ మార్పులను అరికట్టడానికి, విద్యార్థులను చైతన్యవంతులను చేయడమే కాకుండా వారి సహకారంతో కళాశాలను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఎన్‌సీసీ అధికారి పర్లపల్లి రాజు, మధుకర్, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీవేంకటేశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చివరి రోజు గురువారం ఘనంగా జరిగాయి. పురోహితులు రాజగోపుర శిఖరాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, ఈవో విక్రమ్, నర్సయ్య, కౌన్సిలర్లు, అర్చకులు, వేంకటేశ్వర భజనమండలి, శ్రీ లలితా సేవాట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.